# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ:  17-01-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 2024 జాతీయ క్రీడా పురస్కారాలను ప్రదానం చేశారు.

- మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంతో భారత్ లో ఆటోమొబైల్ రంగం గణనీయంగా పురోగమిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- టెలికాం, డిజిటల్ రంగాలలో భారత్.. ప్రపంచ అగ్రగామిగా నిలుస్తోందని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 118వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

================================

భారత్‌లో ఆటోమొబైల్ రంగం గతంలో ఎన్నడూ లేని విధంగా పురోగమిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో 6 రోజుల భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో- 2025ను ప్రారంభించిన సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... వికసిత్ భారత్ ప్రయాణం... ఆటోమొబైల్ రంగంలో గణనీయమైన వృద్ధిని సాధిస్తుందని పేర్కొన్నారు. గత సంవత్సరం దేశ ఆటో పరిశ్రమ 12 శాతం వార్షిక వృద్ధిని సాధించిందని, “మేక్ ఇన్ ఇండియా” కార్యక్రమంతో మరింత అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. నూతన జాతీయ లాజిస్టిక్ విధానం ద్వారా భారత్ ప్రపంచంలోనే అత్యంత బలీయమైన లాజిస్టిక్ దేశంగా ఆవిర్భవించనుందని ఉద్ఘాటించారు. గ్రీన్ టెక్నాలజీ, విద్యుత్ వాహనాలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తున్నామన్నారు. ఆటోమొబైల్ రంగంలో పెట్టుబడులకు భారత్ అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని ప్రధాని పేర్కొంటూ ...

(వాయిస్ 35 సెకన్లు)

================================

బెంగుళూరులో అమెరికన్ కాన్సులేట్‌ను విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమెరికా దేశంతో సంబంధాలను బలోపేతం చేసేందుకు బెంగళూరులో కొత్త కాన్సులేట్ అవసరమని అన్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధ, అంతరిక్షం, రక్షణ, డ్రోన్, బయోటెక్నాలజీ వంటి సాంకేతిక రంగాలలో రెండు దేశాల మధ్య పరస్పర సహకారానికి దోహదపడుతుందన్నారు. ప్రపంచంతో సన్నిహిత సంబంధాలు పెంపొందించుకోవడం కోసం దేశ వ్యాప్తంగా కాన్సులేట్ లను ప్రారంభించడానికి భారత్ అనుకూలమని కేంద్రమంత్రి వ్యాఖ్యానిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 29న ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహాకుంభ్‌లో "మౌని అమావాస్య" రోజున త్రివేణి సంగమం వద్దకు 8 కోట్ల మందికి పైగా భక్తులు అమృత స్నానానికి వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ సింగ్, డీజీపీ ప్రశాంత్ కుమార్‌లు మహాకుంభ్ ప్రాంతంలో పర్యటించి.. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాకుంభ్ కి ప్రధానమంత్రి కూడా హాజరయ్యే అవకాశం ఉన్నందున ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 118వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రాజధానిలో వాయు కాలుష్యాన్ని నియంత్రించే ప్రయత్నంలో భాగంగా నేషనల్ క్యాపిటల్ రీజియన్ (NCR) పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో బాణాసంచాపై పూర్తి నిషేధాన్ని విధిస్తూ ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వుల గడువును సుప్రీంకోర్టు పొడిగించింది. ఈరోజు వరకు అమలులో ఉన్న నిషేధాన్ని తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించాలని జస్టిస్ అభయ్ ఎస్. ఓకా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేస్తూ... ఫెడరేషన్ ఆఫ్ బాణాసంచా ట్రేడర్స్ దాఖలు చేసిన జోక్య దరఖాస్తును కూడా ఆ రోజున విచారించేందుకు ధర్మాసనం అంగీకరించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

టెలికాం, డిజిటల్ రంగాలలో భారత్.. ప్రపంచ అగ్రగామిగా నిలుస్తోందని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. డిజిటల్ భారత్ నిధి (DBN) నిధులతో 4G మొబైల్ సైట్‌లలో సంచార్ సాథీ మొబైల్ అప్లికేషన్, నేషనల్ బ్రాడ్‌బ్యాండ్ మిషన్ 2.0 ఇంకా... ఇంట్రా సర్కిల్ రోమింగ్‌లను ఆయన ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... టెలికాం రంగం భవిష్యత్‌లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించనుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ ఉక్కు కర్మాగారానికి 11 వేల 440 కోట్ల రూపాయల పునరుద్ధరణ ప్యాకేజీ ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ... నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో పునరుద్ధరణ ప్యాకేజీకి ఆమోదం లభించిందని పేర్కొన్నారు. దేశంలోని ఉక్కు రంగంలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (RINL) ఒక ముఖ్యమైన కంపెనీ అన్నారు. ఈ ప్యాకేజీ సహాయంతో RINL ఉద్యోగులకు, వాటాదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా అవార్డులు 2024ను ప్రదానం చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్ డి. గుకేష్, పారిస్ ఒలింపిక్స్‌లో డబుల్ పతక విజేత మను భాకర్, పురుషుల హాకీ టీమ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారిస్ పారాలింపిక్స్‌లో స్వర్ణ పతక విజేత ప్రవీణ్ కుమార్‌లకు ప్రతిష్ఠాత్మకమైన మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు లభించింది. పారా షూటింగ్ కోచ్ సుభాష్ రాణా, షూటింగ్ కోచ్ దీపాలీ దేశ్ పాండే, హాకీ కోచ్ సందీప్ సాంగ్వాన్, బ్యాడ్మింటన్ కోచ్ మురళీధరన్, ఫుట్‌బాల్ కోచ్ అర్మాండో ఆగ్నెలో కొలాకోలకు ద్రోణాచార్య అవార్డును అందజేశారు. ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విశ్వవిద్యాలయంగా చండీగఢ్ విశ్వవిద్యాలయానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ట్రోఫీ లభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్థానిక కేబుల్ ఆపరేటర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్రమబద్ధీకరించడంలో భాగంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 1994 నాటి కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నిబంధనలను సవరిస్తూ.. ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం... స్థానిక కేబుల్ ఆపరేటర్ల రిజిస్ట్రేషన్లు ఈరోజు నుంచి పూర్తిగా ఆన్‌లైన్‌లో జరగనున్నాయని, దరఖాస్తుదారుల వివరాలను ధృవీకరించిన తర్వాత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు నిర్ణీత సమయంలో జారీ చేయబడతాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే... రిజిస్ట్రేషన్ చెల్లుబాటు కాలం కూడా దేశవ్యాప్తంగా 5 సంవత్సరాలకు పెరిగింది. సవరించిన నిబంధనల ప్రకారం, రిజిస్ట్రేషన్ లేదా రెన్యూవల్ కోసం 5 వేల రూపాయల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవలసి ఉంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నం... ఒడిశాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ ఉదయం భువనేశ్వర్ చేరుకున్నారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ... బిజు పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికారు. ఈ నెల 28, 29వ తేదీల్లో జరగనున్న ఉత్కర్ష్ ఒడిశా మేక్-ఇన్-ఒడిషా కాన్‌క్లేవ్ కు ముందు సింగపూర్ అధ్యక్షులు పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో సింగపూర్ అధ్యక్షుడితో పాటు పలువురు మంత్రులు, పార్లమెంటు సభ్యులు, అధికారులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పాల్గొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నిత్యావసర ఆహార వస్తువులు వినియోగదారులకు అందుబాటులో ఉండేలా దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం వంటి పలు చర్యలు తీసుకున్నట్టు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ తెలిపింది. నిత్యావసర వస్తువుల ధరలు స్థిరంగా కొనసాగేలా వాటి ధరలను, లభ్యతను నిశితంగా పరిశీలిస్తున్నట్టు పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =